క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్‌లైన్ల రీకండక్టరింగ్ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ వినాయక్‌రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

◆ ధోలారీధని, ఎన్‌సీఎల్ ఫీడర్ల పరిధిలోని పోచమ్మగడ్డ, సాయికృపా అపార్ట్‌మెంట్స్, ధోలానిధనీ రోడ్డు, కొంపల్లి శ్మశానగడ్డ, హార్లిక్స్ కంపెనీ ప్రాంతం, వెంకటరెడ్డి పెట్రోల్ బంక్, ఎస్ఎస్ఆర్, చంద్రారెడ్డి గార్డెన్స్ రోడ్డు, ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలోని కేవీఆర్ ఫంక్షన్ హాలు లేన్, విజయశాంతి ఎన్‌క్లేవ్, శివారెడ్డి గొడౌన్స్, ఎన్‌సీఎల్ స్విమ్మింగ్‌పూల్స్, ప్రజెయ్ అపార్ట్‌మెంట్స్, మనభూమి ఎన్‌క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్స్, జయభేరి అపార్ట్‌మెంట్స్, గార్డెన్ సొసైటీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బాలాజీ ఫీడర్ పరిధిలో...

నిజాంపేట్: రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడనుందని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. బాలాజీ ఫీడర్ పరిధిలోని శంభీపూర్, మహేశ్వరం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

జీడిమెట్ల: సెలవుల్లో సైతం ప్రత్యేక క్లాసుల పేరుతో పాఠశాలలు నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గొల్లజాన్ డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు దసరా సెలవుల్లో సైతం యథేచ్ఛగా నడుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా పాఠశాలలు నడుపుతున్న పాఠశాలలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఊరెళ్తున్నారా.. అయితే జాగ్రత్త!

సూరారం సీఐ వెంకటేశ్వరరావు

సుభాష్‌నగర్: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ఊరికి వెళ్లేవారు జాగ్రత్త వహించాలని సూరారం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఇంటికి వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు, నగదు ఇంట్లో ఉంచరాదని పేర్కొన్నారు. కాలనీ, అపార్ట్‌మెంట్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అపార్ట్‌మెంట్‌కు కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు సెక్యూరిటీ కార్డులు పూర్తి వివరాలు తీసుకున్న తర్వాతనే అనుమతించాలని సూచించారు. ఇళ్ల మధ్యలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తచ్చాడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ విషయమై బస్తీ, కాలనీలో పోలీసు సిబ్బందితో ప్రచారం చేసి అవగాహన కల్పించినట్లు సీఐ తెలిపారు.

అధిక నీటి బిల్లుల సమస్యను పరిష్కరించాలి

చింతల్: చింతల్ డివిజన్ చంద్రనగర్‌లో వస్తున్న అధిక నీటి బిల్లుల సమస్యను పరిష్కరించాలని బస్తీ నాయకుడు డేగల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం జీఎం శ్రీధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. చంద్రానగర్‌లో అర్హత కలిగిన బిల్డింగ్‌లకు నీటి బిల్లులు అధికంగా వస్తున్న విషయమై జీఎంతో కలిసి చర్చించగా ప్రభుత్వ నిబంధనల మేరకు బిల్లులు జారీ అవుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. బస్తీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇటీవల నూతన పైపులైన్ పనులను ప్రారంభించామని తెలిపారు. చంద్రానగర్‌కు చెందిన చిన్న తదితరులు జీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

మాజీ వీఆర్ఏ హల్‌చల్

- అక్రమ నిర్మాణాలంటూ అర్ధరాత్రి కూల్చివేతలు
- బయటకు పరుగులు తీసిన ఇళ్లలోని వారు
- కాళ్లు చచ్చుబడిపోవడంతో ఇంట్లోనే ఉండిపోయిన ఓ వ్యక్తి
- ఇటుకలు ఒంటిపై పడటంతో తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి
- మాజీ వీఆర్ఏ క్యాసినోలో పట్టుబడి సస్పెన్షన్‌కు గురికావడం గమనార్హం





కూల్చివేతలు చేపట్టిన మాజీ వీఆర్ఏ ఉప్పరి వాసు



మృతి చెందిన జంగపురి

సుభాష్‌నగర్: సస్పెన్షన్‌కు గురైన ఓ మాజీ వీఆర్ఏ తన అనుచరులతో కలిసి హల్‌చల్ చేశాడు. ఆయన చేసిన రాక్షస క్రీడకు ఒక నిండు ప్రాణం బలైంది. కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని గాజులరామారం గ్రామానికి చెందిన ఉప్పరి వాసు గతంలో వీఆర్ఏగా పనిచేశాడు. ఏప్రిల్ 1న థాయిలాండ్‌లో క్యాసినో ఆడుతూ అక్కడి పోలీసులకు పట్టుబడ్డాడని ఆరోపిస్తూ ఇక్కడ అధికారులు సస్పెండ్ చేశారు.

చట్టం చేతిలోకి తీసుకొని...

గాజులరామారం కైసర్‌నగర్‌లోని హనుమాన్ టెంపుల్ ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 342 ప్రభుత్వ స్థలంలో ఇటీవల కొన్ని నిర్మాణాలు వెలిశాయి. వాసు ఆదివారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో జేసీబీతో కొంతమందితో అక్కడికి చేరుకొని ఇళ్ల కూల్చివేతలు చేపట్టారు. ఐదు ఇళ్లు కూలిన అనంతరం అక్కడ ఉన్నవారు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

◆ జంగపురి (42) అనే వ్యక్తి ఇల్లు కూల్చి వేస్తుండగా అతని భార్య దుర్గమ్మ, పిల్లలు భయంతో బయటకు పరుగులు తీశారు. జంగపురి రెండు కాళ్లు చచ్చిపడటంతో కదలలేని స్థితిలో అక్కడే ఉండిపోయాడు. ఈ క్రమంలో ఇటుకలు అతని ఛాతి, తలపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కూకట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేయించేందుకు అంత డబ్బు లేకపోవడంతో సోమవారం గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం 6గంటలకు జంగపురి మృతి చెందాడు. మృతుడికి ఇంద్ర, అఖిల, స్వప్నలు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య దుర్గమ్మ రాళ్లుపడుతూ వారిని పోషిస్తోంది.

ఆందోళన.... ఫిర్యాదు..

సస్పెండ్ కు గురైన మాజీ వీఆర్ఏ వాసు తమ ఇళ్లను ఎలా కూల్చివేస్తారంటూ వడ్డెర సంఘం నాయకులు మండిపడ్డారు. ఈ విషయమై సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానందను కలిసి జరిగిన ఘోరాన్ని వివరించారు.

వచ్చిన వారంతా మద్యం సేవించిన వారే....

కూల్చివేతలకు మాజీ వీఆర్ఏ వెంబడి 10మంది వరకు వచ్చారని... వారంతా మద్యం సేవించి ఉన్నారని స్థానికులు తెలిపారు. మహిళలని చూడకుండా తమపై దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎలాంటి ఫిర్యాదు రాలేదు: జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్

కూల్చివేతలు చేపట్టినప్పుడు తీవ్రగాయాలై ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఫిర్యాదు రావడంతోనే కూల్చివేతలు: తహసీల్దార్

సర్వే నంబర్. 342 ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. దీంతో తామే అధికారికంగా కూల్చివేతలకు వెళ్లామని స్పష్టం చేశారు. మాజీ వీఆర్ఏ వాసుకు ఈ కూల్చివేతలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కానీ స్థానికంగా ఉన్నవారు కావాలనే మాజీ వీఆర్ఏ వాసుపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై మహిళల దాడి

పోలీసులకు అధికారుల ఫిర్యాదు

కుత్బుల్లాపూర్: అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై మహిళలు దాడి చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కుత్బుల్లాపూర్ మండలంలోని పేట్‌బషీరాబాద్ సర్వేనెంబర్ 25బై1 యాదిరెడ్డి బండ సమీపంలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చోటు చేసుకుంటున్న విషయంపై పరిశీలించేందుకు రెవెన్యూ అధికారి రేణుకాదేవి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి సుజాత అక్కడకు వెళ్లారు. అక్కడ నిర్మాణాలు చేపడతున్న భారతమ్మ, సంతోష అనే ఇద్దరు మహిళలు కలిసి రెవెన్యూ అధికారులపై దాడికి దిగి జుట్టుపట్టి కొట్టారు. అక్కడే ఉన్న సురేష్ అనే వ్యక్తి మహిళలను రెచ్చగొట్టి దాడికి పాల్పడేలా ఉసిగొల్పాడని రెవెన్యూ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. సీఐ ప్రశాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





అ'పూర్వ' సమ్మేళనం

కుత్బుల్లాపూర్: పూర్వ విద్యార్థులు అందరూ ఒక చోట చేరారు. ఒకరి బాగోగులు ఒకరు అడిగి తెలుసుకున్నారు.వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అందరు కలిసి ఆడిపాడారు ఈ చక్కటి కలయికకు కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల వేదికగా మారింది. వివరాల్లోకెళితే 2004-05 సంవత్సరానికి చెందిన కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళను కార్యక్రమం నిర్వహించారు. గురువులైన చంద్రశేఖర్, లీలావతి ఉపాధ్యాయులను సన్మానించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తికి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన బాలకృష్ణ(33), కంచర్లదేవి భార్యాభర్తలు. వీరు తమ పిల్లలతో కలిసి ఎనిమిది నెలల క్రితం సూరారంలోని కృషినగర్ కాలనీలో వచ్చి స్థానికంగా ఉన్న ఓ కంపెనీలో పని చేస్తున్నారు. కాగా గత నెల 24వ తేదీన డబ్బుల విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో బాలకృష్ణ ఇంట్లోని గ్యాస్ సిలిండర్‌ను లీక్ చేసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా ఇంటి యజమాని వారికి ఖాళీ చేయించాడు. దీంతో బాలకృష్ణ చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. అతని మొబైల్‌కు యత్నించినా స్విచ్ఛాఫ్ రావడంతో కంచర్లదేవి తన పిల్లలను తీసుకుని బంధువు ఇంటికి వెళ్లిపోయింది. కాగా ఈ నెల 15వ తేదీన సూరారం సిగ్నల్స్ సమీపంలోని సాగర్ హోటల్ వెనుక ఉన్న గదిలో బాలకృష్ణ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి పడటంతో డ్రైవర్ మృతి

దుండిగల్: అతి వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ మూలమలుపు వద్ద అదుపుతప్పడంతో డ్రైవర్ అదే ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజిపల్లి ప్రాంతానికి చెందిన బోయ లవ(30) ట్రాక్టర్ నడుపుతు జీవనం సాగిస్తున్నాడు. కాగా పనిపై సోమవారం ట్రాక్టర్‌పై లవ బాచుపల్లికి వచ్చి తిరిగి ఖాజీపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బౌరంపేటలోని మల్లన్న గుడి సమీపంలో మూలమలుపు వద్ద వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి గుంతలో పడిపోయింది. దీంతో అదే ట్రాక్టర్ కింద పడిపోయిన లవకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు

జీడిమెట్ల: ఇంటి నుంచి తప్పిపోయిన బాలుడిని జీడిమెట్ల పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతల్ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన క్రాంతి కుమారుడు పంచుల్(4) సోమవారం ఉదయం 10గంటలకు ఇంటి సమీపంలో ఆడుకుంటూ తప్పిపోయాడు. దీంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతకగా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా బాబును భూమిరెడ్డినగర్ కమిటీహాల్ వద్ద గుర్తించారు. అనంతరం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

కుత్బుల్లాపూర్ నియోజకర్గ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవార్లను గాయత్రీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి జరిగిన అభిషేకాలు, కుంకుమార్చనల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో రేణుకాఎల్లమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



సుచిత్రలోని ప్రగతి ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లోని దుర్గామాత మండపంలో జరిగిన పూజలో మహిళలు



జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని ఎన్నా చెరువు కొలనును సోమవారం సిబ్బంది బతుకమ్మ పూలను తొలగించి శుభ్రం చేస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. - సుభాష్‌నగర్








బీ-ఫారమ్ అందుకున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే వివేకానంద్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం సీఎం కేసీఆర్ ఆయనకు బీ-ఫారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్‌లో హ్యాట్రిక్ సాధించిన సీఎంకు బహుమతిగా అందిస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఉన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌కు బీ-ఫారమ్ అందజేస్తున్న సీఎం కేసీఆర్

ఇంటి నుంచే ఓటు వేసుకునే సౌకర్యంపై అవగాహన

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అధ్యక్షతన సోమవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగ ఓటర్లకు, 80 ఏళ్లు నిండిన వృద్ధులు ఇంటి నుంచి ఓటు వేసుకునే సౌకార్యాన్ని కల్పించే విషయమై విధి విధానాలు, నిబంధనలపై వారికి సైదులు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఉపకమిషనర్ నాగమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలు ఇస్తున్న రిటర్నింగ్ అధికారి సైదులు

జంగ్ 2023 తెలంగాణ

పోలీసుల తనిఖీలు... రూ.లక్షల్లో పట్టివేతలు

దుండిగల్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాగిల్లాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. నర్సాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.4.95 లక్షలను దుండిగల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న డబ్బును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. సరైన పత్రాలు సమర్పిస్తే డబ్బులు తిరిగిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

జీడిమెట్ల ఠాణా పరిధిలో రూ.3,92,500 పట్టివేత..

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు రూ.3,92,500 నగదును సీజ్ చేశారు. గుండ్ల పోచంపల్లికి చెందిన వినయ్ కారులో వెళ్తుండగా చెకింగ్‌లో భాగంగా పోలీసులు అతడి వాహనాన్ని తనిఖీ చేశారు. అతని వద్ద లభ్యమైన రూ.3,92,500 నగదుకు ఎలాంటి ఆధారాలు చూపించలేదు. దీంతో నగదును సీజ్ చేశారు.

జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో రూ.1.20లక్షల పట్టివేత..


జగద్గిరిగుట్ట: ఎన్నికల తనిఖీల్లో భాగంగా సోమవారం రాత్రి జగద్గిరిగుట్ట పోలీసులు రూ. 1.20 లక్షల నగదును సీజ్ చేశారు. దేవమ్మ బస్తీలో తనిఖీలు చేపట్టగా అటుగా వచ్చిన గాజులరామారం ప్రాంతానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి నుంచి రూ.1.20 లక్షలు దొరికాయి. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో డబ్బుతో వెళ్తున్న వ్యక్తి

కుత్బుల్లాపూర్: ఎస్ఓటీ పోలీసులు రూ. 7.81 లక్షలతో వెళ్తున్న ఓ వ్యక్తిని అదుపులో తీసుకొని పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో సుచిత్ర సమీపంలో ఓ వ్యక్తి డబ్బులతో వెళ్తుండగా ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. అయితే మద్యం దుకాణం సంబంధించిన డబ్బులు అని ఎంత చెప్పినా వినకుండా ఎస్ఓటీ పోలీసులు దురుసుగా వ్యవహరించి సదరు వ్యక్తి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు మైనారిటీ నేత షాక్

బీఆర్ఎస్‌లోకి కుత్బుల్లాపూర్ మైనారిటీ నేత సిరాజ్



ఎండీ సిరాజ్‌కు కుండవా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్

కుత్బుల్లాపూర్: ఇతర పార్టీల నేతలకు పెద్దపీట వేస్తూ... కాంగ్రెస్ పార్టీ సీనియర్లను పట్టించుకోవడంలేదని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మైనారిటీ నేత మహమ్మద్ సిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొలను హన్మంతరెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో టీపీసీసీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నానని తెలిపారు. రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో సిరాజ్ తన అనుచరులు గౌసుద్దీన్, జలీల్, శౌరిరాజ్‌లతో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో సోమవారం బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. సంక్షేమ పథకాలకు రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ సాధించి చరిత్ర సృష్టించబోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ టి.లక్ష్మారెడ్డి, డివిజన్ల అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, పుప్పాల భాస్కర్, నాయకులు అబ్దుల్ ఖదీర్, రషీద్ బైగ్, మఖ్సూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



మార్నింగ్ వాక్‌లో ఓటర్లను కలుస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు తమ వైపే ఉన్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం గాజులరామారం డివిజన్‌లోని ఆక్సిజన్ పార్కులో మార్నింగ్ వాకింగ్ చేసే యువతను కలిసి పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో రాష్ట్ర ప్రజల విసుగు చెందారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కుత్బుల్లాపూర్ టికెట్ ఇవ్వాలని దరఖాస్తు

వైఎస్సార్‌టీపీ నేత సాతాల గోపాల్



జీడిమెట్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన మంచి పనులే వైఎస్సార్‌టీపీ జెండా కుత్బుల్లాపూర్‌లో ఎగిరేలా చేస్తుందని పార్టీ నాయకులు సాతాల గోపాల్ అన్నారు. వైఎస్సార్‌టీపీ తెలంగాణలో ఉన్న 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ టికెట్ కేటాయించాలని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ సాతాల గోపాల్ పార్టీ హైకమాండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ వైఎస్సార్‌టీపీ టికెట్ తనకే దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు సైతం వైఎస్సార్‌పైన ఉన్న అభిమానంతో పార్టీకి ఓటు వేస్తారని అన్నారు.